# పుష్కర విధులు



## స్నానం

పుష్కర స్నానాన్ని ఓ పవిత్రకార్యంగా భావించాలే కానీ మురికిని వదిలించుకునే అభ్యంగనంగా కాదు. అందుకే శుభ్రమైన దుస్తులతో, సంకల్పం చెప్పుకొని మూడు మునకలు వేయాలి. నదిలో నలుగురూ స్నానం చేస్తున్న చోట బట్టలుతుకుతూ, సబ్బు రాసుకుంటూ ఉంటే అది పుష్కర స్నానం అనిపించుకోదు. స్నానం ఆచరిస్తున్న సమయంలో ఇష్టదైవాన్ని స్మరించుకోవాలి. జీవకోటి దాహార్తిని తీరుస్తున్న నదీమ తల్లికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. స్నానం పూర్తయిన తర్వాత నర్మదాదేవికి, త్రిమూర్తులకు, బృహస్పతికి, పుష్కరుడికి, సప్తర్షులకు, అరుంధతికి అర్ఘ్యాలు అందించడం విధి. పితృదేవతలకు కూడా నీరు వదిలి బయటికి వచ్చిన తర్వాత విభూది, కుంకుమలు అద్దుకోవాలి. ఆపై తీరం సమీపంలో ఉన్న ఆలయానికి చేరుకుని దైవదర్శనం చేసుకోవాలి.

## దానం

పుష్కరాలు జరిగే 12 రోజులలో, రోజుకో తరహా దానం చేయాలని పెద్దలు సూచిస్తున్నారు. ఉదాహరణకు తొలి రోజు బంగారం, వెండి, ధాన్యం, భూమి దానం చేస్తే మహారాజ యోగం దక్కుతుందనీ... రెండో రోజు వస్త్రాలు, గోవులు, ఉప్పు, రత్నాలు దానం చేస్తే వసులోక ప్రాప్తి లభిస్తుందనీ ఇలా రోజుకొక దానాన్నీ, దాని వల్ల కలిగే ఫలితాలనూ సూచించారు. సాయం చేయాలనీ, సంపదను సాటివారితో పంచుకోవాలనీ సూచించే సంప్రదాయానికి ప్రతిరూపంగా ఈ విధులను భావించవచ్చు.

## శ్రాద్ధకర్మలు

పెద్దలను తలుచుకునేందుకు, వారి పట్ల కృతజ్ఞత చాటేందుకు, వారి ఆశీస్సులు తీసుకునేందుకు పుష్కరాలు ఓ మంచి సందర్భం. పుష్కర సమయంలో గతించిన పెద్దలకు శ్రాద్ధకర్మలు చేస్తే వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయనీ, వంశం వృద్ధి చెందుతుందనీ నమ్మకం. పిండప్రదానం చేయలేనివారు నువ్వులు, నీళ్లతో తర్పణాలు విడిస్తే సరిపోతుందని పెద్దల మాట. మాతాపితరులు మరణించిన తిథి రోజున శ్రాద్ధకర్మ చేస్తే మరీ మంచిది. కేవలం గతించిన మన పెద్దలకే కాదు... సమీప బంధువులకు, స్నేహితులకు, ఆత్మీయులకు కూడా పిండ ప్రదానం చేయవచ్చు.

అంతేకాదు! పుష్కరుడితోపాటు సకల దేవతలూ కొలువుండే ఈ సమయంలో... ఆ నీటిని కొంత ఇంటికి తెచ్చుకుని వాటిని సంప్రోక్షణ కోసం వాడుకోవడం ఆనవాయితీ. పుష్కరాలు జరిగే నదీతీరాన భజనలు, కీర్తనలతో భక్తులు నదీమతల్లిని కొలుచుకోవడమూ, నదికి వాయినాలు సమర్పించుకునే ఆచారమూ కొన్ని ప్రాంతాల్లో చూడవచ్చు.


దీన్ని నాభిస్థానం అని కూడా అంటారు. సూర్య దేవాలయం, రేణుక ఆలయం లాంటి ప్రాచీన ఆలయాలూ ఇక్కడ కనిపిస్తాయి.

**మహేశ్వర్**

ఒకనాటి మాహిష్మతి పట్టణమే నేటి మహేశ్వర్. అటు రామాయణం, ఇటు భారతంలోనూ ఈ నగరానికి సంబంధించి చాలా కథలు వినిపిస్తాయి. రావణుడికి గర్వభంగం కావడం, ఈ దేశ రాకుమారిని అగ్నిదేవుడు మోహించడం లాంటి ఆసక్తికరమైన ఘట్టాలు ఇక్కడ వినిపిస్తాయి. కార్తవీర్యార్జునుడి లాంటి పురాణ పురుషులతో ఇక్కడి ఇతిహాసం ముడిపడి ఉంది. ఇక్కడి ఆలయాలు, కోటలు, ఘాట్ల మీద ప్రాచీన కట్టడాలు చూసితీరాల్సిందే. వాటి వెంబడి గంభీరంగా పారే నర్మద మనసును సేదతీరుస్తుంది. ఇంత అందమైంది కాబట్టే ఈ మహేశ్వర్ తీరాన ఎన్నో సినిమా షూటింగులు కూడా జరుగుతుంటాయి. సఖి నుంచి గౌతమీ పుత్ర శాతకర్ణి వరకు చాలా సినిమాలకు ఇక్కడి దృశ్యాలు ప్రాణం పోశాయి.

ఇవే కాదు భరూచ్, హోషంగాబాద్, బార్వా, నర్మదానగర్... ఇలా నర్మద తీరం వెంబడి ఎన్నో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు కనిపిస్తాయి. ఇవన్నీ కూడా ప్రత్యేకించి దర్శించదగ్గవే!

నది ఓ భౌగోళిక స్థితి మాత్రమే కాదు. నాగరికతకు వేదిక. ఆ నదీ తీరాన ఎన్నో సంస్కృతులు విరాజిల్లి ఉంటాయి. ఎన్నో అరుదైన వాతావరణాలు ఏర్పడి ఉంటాయి. నర్మదనే తీసుకుంటే.. కొన్ని లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్నది. నర్మద కెనాల్ ద్వారా ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌కు కూడా నీరు అందుతున్నది. దీని మీద నిర్మించిన సర్దార్ సరోవర్ డ్యామ్, ఇందిరా సాగర్ డ్యామ్ లాంటి ఆనకట్టల మీద పర్యావరణపరంగా అనేక వివాదాలు ఉన్నప్పటికీ... అవి అసాధారణ స్థాయిలో విద్యుత్తు, సాగుతాగు నీటిని అందిస్తున్నాయి. నర్మద చలవతో ఏర్పడిన దట్టమైన అరణ్యాలు జీవవైవిధ్యాన్ని



కాపాడుతున్నాయి. ఇలా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మన దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థకు ఆయువుపట్టులా ఉన్న నర్మదకు పుష్కరాలు రావడం అంటే... ఒకసారి తన గురించి తెలుసుకోమంటూ ఆ నదీమతల్లి అందిస్తున్న పిలుపుగా భావించవచ్చు. ఈ వంకతోనైనా ఓసారి అటువైపు ప్రయాణించవచ్చు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ పుష్కరాల సందర్భంగా ఎన్నో ఘాట్లు ఏర్పాటు చేశాయి ప్రభుత్వాలు. అక్కడ మునక వేసి... చుట్టూ ఉన్న ప్రకృతినీ, ఆలయాలనూ చూసి వద్దాం.



